న్యాయవాదులూ నిత్యవిద్యార్థులే..

జస్టిస్ సీతారామమూర్తి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ సీతారామమూర్తి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: న్యాయవాదులు కూడా నిత్య విద్యార్థులేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం.సీతారామమూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పొత్తూరి భారతీ ఫౌండేషన్, కేఎంఆర్ లీగల్ ఎయిడ్, న్యాయమిత్ర అకాడమీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ముఖ్యఅతిథి జస్టిస్ ఎం.సీతారామమూర్తి మాట్లాడుతూ ఎంతో ఉన్నత ఆశయంతో పొత్తూరి భారతీ ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతివ్యక్తి పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించడంతోపాటు నిజం మాట్లాడాలని, దానితోనే సంతోషం కలుగుతుందన్నారు. ఏ రోజు పాఠాన్ని ఆ రోజు చదువుకునే విద్యార్థులే టాపర్లుగా నిలుస్తారని అన్నారు. ఏ వృత్తిలో ఉన్న వ్యక్తి అయినా సరే విలువలను పాటిస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ఇళ్లే ఒక పాఠశాలగా భావించి ప్రాథమిక దశ నుంచే పిల్లలకు విలువలు నేర్పాలని సూచించారు. పొత్తూరి భారతీ ఫౌండేషన్ చైర్మన్, సుప్రీంకోర్టు అడ్వకేట్ పి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యం అనేది ఒక ప్రాథమిక హక్కుగా గుర్తించి ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్యాన్ని అందించాలనే దిశగా తమ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ బి.వేణుగోపాల్‌రావు, ఐలు తెలంగాణ అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, ఐలు ఏపీ అధ్యక్షులు కె.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉద్యోగాలు వస్తాయి

చిక్కడపల్లి: కష్టపడి చదివితే ఉద్యోగాన్ని సాధించవచ్చని తెలంగాణ నిరుద్యోగ విద్యార్థి ఉద్యమ వేదిక అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మణ్ అన్నారు. ఇటీవల విడుదలైన తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ర్యాంకు సాధించిన బి.సురేష్‌ను శుక్రవారం అశోక్ నగర్లో నిరుద్యోగ అభ్యర్థులు సన్మానించారు.

బధిరులపై అఘాయిత్యాలను అరికట్టాలి



వల్లభనేని ప్రసాద్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో బధిర మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేలా రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, నిందితులను శిక్షించాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్(డీఎస్‌డీ) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో బధిర మహిళలపై అత్యాచారాలు ఇటీవల పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటరిగా ఉంటున్న బధిర మహిళలపై అత్యాచారులు నిత్యకృత్యంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. వికలాంగులను చిన్నచూపు చూడకుండా తగిన ప్రోత్సాహం కల్పించాలని కోరారు. మహబూబ్‌నగర్ జిల్లాలో బధిర వికలాంగుల ఆడపిల్లలపై అత్యాచారాలు ఎక్కువ నమోదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరహా సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి వి.భారతి, కోకన్వీనర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వేలిముద్రలతో జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి

పారిశుధ్య వేతనాలు కాజేసిన ఇద్దరు ఎస్‌ఎఫ్‌ఏల అరెస్ట్



జీహెచ్‌ఎంసీ సొమ్మును కాజేసి పట్టుబడ్డ ఎస్‌ఎఫ్‌ఏలు పి.శివయ్య ఉమేశ్, జె.శివరాములు

అంబర్‌పేట్: నకిలీ వేలిముద్రలు సృష్టించి జీహెచ్ఎంసీ ఆదాయానికి గండి కొడుతున్న ఇద్దరు జీహెచ్ఎంసీ ఉద్యోగులను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన శుక్రవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జీహెచ్ఎంసీ సర్కిల్–16 పరిధిలో పి.శివయ్య ఉమేశ్, జె.శివరామ్‌లు ఎస్ఎఫ్ఏలుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో పనిచేసే పారిశుధ్య కార్మికుల వేలిముద్రలను పోలిన నకిలీ వేలి ముద్రలను తయారు చేశారు. విధులకు హాజరు కానీ పారిశుధ్య కార్మికుల నకిలీ వేలుముద్రలతో విధులకు హాజరైనట్లు రికార్డు నమోదు చేసే వారు ప్రతినెలా గుట్టు చప్పుడు కాకుండా కాజేస్తున్నారు.ఇప్పటి వరకు వీరు సుమారు రూ.86.40 లక్షలను జేబుల్లో నింపుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అక్రమాలను పసిగట్టిన టాస్క్‌ఫోర్స్ సెంట్రల్‌జోన్ పోలీసులు నిందితులను పట్టుకొని వారి వద్ద నుంచి 35 నకిలీ వేలి ముద్రలు, రెండు బయోమెట్రిక్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీ పెరుమాల్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, ఎస్సై నవీన్‌కుమార్‌లు నిందితులను పట్టుకున్నారు. తదుపరి కేసు విచారణ నిమిత్తం వీరిని అంబర్‌పేట పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

తెలంగాణ ప్రైవేటు డిగ్రీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాలకృష్ణారెడ్డి



ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్‌లో మాట్లాడుతున్న అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రైవేటు డిగ్రీ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ బాలకృష్ణారెడ్డి, చీఫ్ అడ్వైజర్‌గా రాజేశ్వర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేదిశగా కృషి చేస్తామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షలా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించాలని కోరారు. స్కాలర్‌షిప్‌ల విషయాన్ని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరీసతీష్, ప్రధానకార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, డిగ్రీ కాలేజెస్ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు సీతారామ్‌రెడ్డి, పాలమూరు యూనివర్సిటీ అధికారులు జహీర్ అక్తర్, శాతవాహన యూనివర్సిటీ అధ్యక్షుడు మహేందర్, మహాత్మగాంధీ యూనివర్సిటీ అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, అసోసియేషన్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాపర్తి సురేష్‌గౌడ్, రాష్ట్ర నాయకులు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలో ప్రకటించనున్నట్లు వారు తెలిపారు.

'104' ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్



మహాధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

కవాడిగూడ: రాష్ట్రంలో 2008 సంవత్సరం నుంచి ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వైద్యసేవలు అందిస్తున్న '104' అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 104 ఉద్యోగులు మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 104 ఉద్యోగులు పెద్దఎత్తున హాజరయ్యారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్లు, డాటాఎంట్రీ ఆపరేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఫార్మాసిస్టులు, సెక్యూరిటీగార్డులు కలిపి 1,350 మంది 104 సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, గత 15 ఏళ్లుగా ఉద్యోగభద్రత లేకుండా, చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 సంవత్సరం నుంచి 104 వాహనాలను పూర్తిగా నిలిపివేసి ఆ ఉద్యోగులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, టీహబ్ సెంటర్లకు కేటాయించిందని గుర్తు చేశారు. 104 ఉద్యోగులు ప్రభుత్వ అధీనంలో పని చేస్తున్నప్పటికీ ఏజెన్సీల ద్వారా వేతనాలు చెల్లించే పద్ధతి వల్ల సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే నేరుగా ఉద్యోగుల ఖాతాలలో ట్రెజరీ ద్వారా వేతనాలను జమ చేయాలని కోరారు. మహాధర్నాలో యూనియన్ గౌరవ అధ్యక్షులు భూపాల్, ఎస్.విద్యాసాగర్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫసియుద్దీన్, యాగానాయక్, రాష్ట్ర నాయకులు విజయవర్ధన్‌రాజు, నవీన్, శుభాష్‌చంద్ర, శ్రీనివాస్, మన్మథరావు, రాజేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే ఇక మునిగినట్టే..

బీజేపీ విజయసంకల్పయాత్రలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



రాంనగర్ చౌరస్తాలో జరిగిన సభలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

ముషీరాబాద్: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందనే కేంద్రమంత్రి, సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యుడు జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో శుక్రవారం విజయసంకల్ప యాత్ర చేపట్టి రాంనగర్ చౌరస్తాలో బహిరంగసభ నిర్వహించారు. సభలో ప్రజలనుద్దేశించి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నిన్నటి పార్టీ అని, ఆ పార్టీకి ఓటు వేస్తే ప్రజలు మునిగిపోయినట్లేనని అన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు తొమ్మిది ఎంపీ సీట్లు ఉండగా, ఈ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా గెలుచుకునే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను పూర్తిగా కనుమరుగు చేయాలని, ఆ పార్టీ ఓడితే రాష్ట్రానికి, దేశానికి జరిగే నష్టం ఏమీ లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉండగా ఇష్టానుసారంగా రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు.

రాహుల్ ట్యాక్స్ పేరిట బెదిరింపులు

కాంగ్రెస్ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపిస్తే పెనం మీద నుంచి పోయిలో పడ్డ మాదిరిగా ప్రజల పరిస్థితి తయారైందని కిషన్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అనేక అవినీతి కార్యక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కాంట్రాక్టర్లను, పారిశ్రామికవేత్తలను, బిల్డర్లను పిలిపించుకొని రాహుల్‌గాంధీ ట్యాక్స్ పేరుతో నాయకులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయకపోగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. అర్హులైన పేదలందరికీ గ్యాస్ సిలిండర్‌ను ఐదు వందల రూపాయలకు, 200 యూనిట్ల లోపు ఉన్న వారందరికీ ఉచిత కరెంటు అందించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఒక్కటే దేశానికి, తెలంగాణ ప్రజలకు ప్రత్యామ్నాయం అని పేర్కొన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉగ్రవాదం, తీవ్రవాదం, ఐఎస్ఐ ఏజెంట్ల ఆగడాల ఊసే లేదన్నారు. గతంలో ఎక్కడపడితే అక్కడ దేశంలో బాంబు పేలుళ్లు, మత ఘర్షణలు మితిమీరిపోయేవని గుర్తు చేశారు. దేశం కోసం, కుటుంబ భవిష్యత్తు, అవినీతి అంతం కోసం బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి దేశ వ్యాప్తంగా 40 సీట్లు కూడా రావని, బీజేపీకి 370కి పైగా స్థానాల్లో గెలుస్తుందని తెలిపారు. ఈ నెల 4వ తేదీన రామగుండంలో పదివేల కోట్ల రూపాయలతో నిర్మించిన 810 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించడానికి ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రాం, కార్పొరేటర్లు కె.రవిచారి, సుప్రియనవీన్‌గౌడ్, రచనశ్రీ, పావని వినయ్‌కుమార్, బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, పూస రాజు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాత్రలో కాషాయ తలపాగాలతో ఆకర్షణీయంగా కనిపించిన బీజేపీ నేతలు



సభకు హాజరైన బీజేపీ శ్రేణులు

ఆకట్టుకున్న గజేంద్ర మోక్షము ప్రవచనాలు

నల్లకుంట: ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా ఆనంద్ గ్రూప్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రవచన కార్యక్రమాలు శుక్రవారం సాయంత్రం నల్లకుంట శంకర మఠం ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పద్మశ్రీ, సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు 'గజేంద్ర మోక్షం'పై ఇచ్చిన ప్రవచనాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమ నిర్వాహకులు ప్రవచకుడిని సన్మానించారు. కార్యక్రమంలో ఆనంద్ గ్రూప్ ప్రతినిధులు సోమయాజుల శ్రీనివాస్, బ్రహ్మానందం, గంటి రవి, శంకరమఠం నల్లకుంట శాఖాధిపతి కె. కృష్ణారావు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయండి

ఇంటర్ విద్యార్థులకు సీఐ సీతయ్య సూచన



పరీక్ష రాసే విద్యార్థులకు సూచనలు చేస్తున్న సీఐ సీతయ్య

చిక్కడపల్లి: ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా, ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని ఇంటర్ విద్యార్థులకు చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ సెంటర్లను తనిఖీ చేస్తూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

డాక్టర్ కొండ దేవయ్య

కాచిగూడ: మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్నూరు కాపు కార్పొరేషన్ సాధనే లక్ష్యంగా మున్నూరు కాపు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణగూడలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా మార్చి 3వ తేదీ నుంచి మున్నూరుకాపు కుల సంఘాల ప్రతినిధులు పర్యటిస్తారని తెలిపారు. ఈ నెల 3 న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధానం నుంచి పర్యటన ప్రారంభమవుతుందని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో ఆర్.వి.మహేందర్ కుమార్, ఎడ్ల రవిపటేల్, బండి సంజీవ్, చింతపండు మహేందర్, ఆరె దశరథ్, ఆరె మహేందర్, వనమాల ప్రవీణ్ కుమార్, దేశెట్టి శివపటేల్, జీవీఆర్, వాసాల వెంకన్న పటేల్, హరికృష్ణ పటేల్, ఆకుల బాలకృష్ణ పాల్గొన్నారు.

నీటిఎద్దడిని నివారించండి



కార్యాలయంలో అధికారులతో కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్

అంబర్‌పేట్: వేసవిలో నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ జలమండలి అధికారులను కోరారు. శుక్రవారం డివిజన్‌లోని జలమండలి కార్యాలయంలో మేనేజర్ మాజీద్‌తో కలిసి నీటి సమస్యపై చర్చించారు. అవసరమైన ప్రాంతాల్లో మంచినీటి పైపులైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. డివిజన్‌లో లోప్రెషర్, కలుషిత నీటి సరఫరా వంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర జలమండలి సిబ్బంది పాల్గొన్నారు.

జీరో బిల్లులు జారీ

- నల్లకుంట డివిజన్‌లో 'గృహజ్యోతి' అమలు
- ప్రారంభించిన విద్యుత్ శాఖ అధికారులు



రత్నానగర్‌లో వినియోగదారులకు జీరో బిల్లులు అందజేస్తున్న అధికారులు

నల్లకుంట: కరెంటు జీరో బిల్లుల జారీ ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వం గత నెల 27న 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచిత విద్యుత్ అందించే గృహజ్యోతి పథకానికి శ్రీకారం చుట్టింది. అర్హులైన వినియోగదారులకు తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు శుక్రవారం నల్లకుంట డివిజన్ బర్కత్‌పుర ఎలక్ట్రిసిటీ సెక్షన్ పరిధిలోని రత్నానగర్, సత్యానగర్‌లో జీరో బిల్లుల జారీ ప్రక్రియను ప్రారంభించాయి. ఈ సందర్భంగా అజామాబాద్ డీఈ కమల్ కుమార్ మాట్లాడుతూ జీరో బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేశారని తెలిపారు. జీరో బిల్లులు అందుకున్న వినియోగదారులు ఎలాంటి బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. మీటర్ రీడింగ్ తీస్తున్న సిబ్బంది.. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన అర్హులకు గృహజ్యోతి కింద జీరో బిల్లులు అందజేస్తున్నారని చెప్పారు. వినియోగదారులకు అందిస్తున్న సబ్సిడీ వివరాలను డిస్కమ్‌లు ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ బర్కత్‌పుర సెక్షన్ ఏడీఈ శ్రీనివాస్, ఏఏఈ జె.బాలరాజు, లైన్ ఇన్‌స్పెక్టర్ బి.గణేష్, లైన్‌మేన్ బి.శంకర్, రత్నానగర్ బస్తీ అధ్యక్షుడు పి.ఈశ్వర్, నాయకుడు కేపీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మేడిగడ్డ సందర్శనకు తరలిన బీఆర్‌ఎస్ నేతలు



మేడిగడ్డ సందర్శనకు బయల్దేరిన జైసింహ, శివముదిరాజ్, శ్రీధర్‌రెడ్డి

ముషీరాబాద్: కాంగ్రెస్ నాయకుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు 'చలో మేడిగడ్డ బ్యారేజ్'కార్యక్రమానికి ముషీరాబాద్ నుంచి పెద్దఎత్తున ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. ర్యాలీని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసేందుకు అప్పటి సీఎం కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తమ రాజకీయ లబ్ధి కోసం వాస్తవాలను ప్రజలకు తెలియజేయకుండా దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ సాగునీరు, తాగునీరు అందించేందుకు అనేక ప్రాజెక్టులు కట్టారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు మేడిగడ్డ బ్యారేజ్‌పై తప్పుడు ప్రచారం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ నాయకులు పూస గోరఖ్‌నాథ్, శ్రీనివాస్, బల్వంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య పిల్లల్లో క్రమశిక్షణ పెంచుతుంది



నిత్య స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న డాక్టర్ శ్రావణ్‌కుమార్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విలువలతో కూడిన విద్య పిల్లల్లో క్రమ శిక్షణ పెంచుతుందని ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని న్యూ ఎరా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిత్య హై స్కూల్ సిఈ కాలనీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరులుగా రాణించి తల్లిదండ్రుల తోపాటు దేశానికి మంచి గుర్తింపు తీసుకు రావాలని అభిలాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ జి.భాస్కర్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్ర ముగింపు సభను విజయవంతం చేయండి

కాచిగూడ: ప్రజల ఆశీస్సులతో బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర పూర్తి స్థాయిలో విజయవంతం అవుతోందని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. నారాయణగూడ వైఎంసీఏ వద్ద నుంచి ఈ నెల 2వ తేదీన శనివారం ప్రారంభమయ్యే విజయసంకల్ప యాత్ర స్థలాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లడుతూ వైఎంసీఏ నుంచి యాత్ర ప్రారంభమై అంబర్‌పేట శ్రీ రమణ చౌరస్తాలో ముగుస్తుందని తెలిపారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కృష్ణ గౌడ్, కన్నె రమేష్ యాదవ్, ఎడెల్లి అజయ్ కుమార్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఎ.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ కేలండర్ ఆవిష్కరణ



మోదీ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కావ్య కిషన్‌రెడ్డి

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ పేరుతో రూపొందించిన 2024 కేలండర్‌ను శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కేంద్రమంత్రి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సతీమణి, అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు జి.కావ్య కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీకి హ్యాట్రిక్ విజయం అందించేలా కార్యకర్తలు, నేతలు కృషి చేయాలన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో మరోసారి కిషన్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్, అరోరా, మనోజ్ షా, దిలీప్ డాగా, యోగేష్ జబక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేవైఎం బైక్ ర్యాలీ

కాచిగూడ: బీజేపీ విజయసంకల్ప యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 2న(నేడు) నారాయణగూడ వైఎంసీఏ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎ.యశ్వంత్ తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నారాయణగూడలో మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమయ్యే బైక్‌ర్యాలీ కాచిగూడ చెప్పల్‌బజార్, బర్కత్‌పుర, గోలాన్నక చౌరస్తా, తిలక్ నగర్, జిందా తిలిస్మాత్ రోడ్డు, డీడీ కాలనీ రెడ్ బిల్డింగ్, బాపు నగర్, పటేల్‌నగర్, జ్యోతిరావు పూలే చౌరస్తా మీదుగా అంబర్‌పేట మహంకాళి దేవాలయం వరకు చేరుకుటుందని తెలిపారు. యువకులు భారీఎత్తున ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు పాల్గొంటారని తెలిపారు.

ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల చేయాలి

బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్



వెంకటేశంకు వినతి పత్రం అందజేస్తున్న విక్రమ్‌గౌడ్

కవాడిగూడ: ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.7,700 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంను కోరారు. ఈ మేరకు శుక్రవారం వెంకటేశంను సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఫీజురీయింబర్స్ రాకపోవడంతో కోర్సులు పూర్తిఅయినా బీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీల యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయని పేర్కొన్నారు. ఉన్నత విద్యాకోర్సులు, ఉద్యోగాల్లో చేరలేక బీసీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి స్కాలర్‌షిప్, ఫీజురియంబర్స్‌మెంటు బకాయిలను విడుదల చేసి బీసీ విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా ఇవ్వాలని విక్రమ్ గౌడ్ కోరారు.

'టెట్' పరీక్ష నిర్వహించాలి



చిన్నారెడ్డికి వినతి పత్రం అంజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: 11 వేల టీచర్ పోస్టుల భర్తీకై నోటిఫికేషన్ జారీ చేయడానికి సన్నాహాలు చేస్తున్న తరుణంలో 'టెట్'పరీక్షను వెంటనే నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో శుక్రవారం నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణలతో కలిసి తెలంగాణ స్టేట్ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెట్ నోటిఫికేషన్ కోసం బీఈడీ, డీఈడీ చేసిన 4 లక్షల మది అభ్యర్థులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. గత టెట్ పరీక్షలో కేవలం 10 శాతం మంది మాత్రమే పాసయ్యారని, 90 శాతం మంది ఫెయిలయ్యారని తెలిపారు. డీఎస్సీ, టెట్‌ఒకేసారి వేస్తే ప్రభుత్వానికి ఏమీ ఇబ్బంది లేదన్నారు.

'మాదిగ అమరుల సాక్షిగా ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం'

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణ కోసం దండోరా ఉద్యమంలో అమరులైన మాదిగ అమరవీరుల సాక్షిగా వర్గీకరణ సాధించి వారి ఆశయ సాధన కృషి చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ పిలుపునిచ్చారు. మార్చి 1వ తేదీన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఉద్యమంలో అసువులు బాసిన పొన్నాల సురేందర్ మాదిగ, దామోదర్ మాదిగ, మహేష్ మాదిగ, రవి మాదిగ, ప్రభాకర్ మాదిగ, బాకీ యాదయ్య మాదిగ, భారతీ మాదిగ అమరవీరులకు నివాళులు అర్పిస్తూ వారి త్యాగాలను గుర్తు చేసుకుంటున్నామన్నారు. పాలడు శ్రీనివాస్, కోర్ కమిటీ సభ్యులు, యువసేనా రాష్ట్ర అధ్యక్షులు పొట్ట పెంజార రమేష్, ఎంఎస్ఎఫ్‌రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరు వెంకటేష్, ఎంఎస్ఎఫ్ జాతీయ నాయకులు జిల్లా వెంకట్, మేడ్చల్ అంజి, శ్యామ్‌రావు, నరేష్, రమేష్, ప్రవీణ్, వంగపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.